క్లుప్తంగా

త్వరలోనే స్టడీ రూమ్, బ్రాంచ్

ఖమ్మంమామిళ్లగూడెం: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియా ద్వారా ఖమ్మంలో స్టడీరూమ్‌తో పాటు బ్రాంచ్ ఏర్పాటు చేయనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. సంస్థ స్థాపించి 77 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కే.ఎస్.ఆర్.కే.ప్రసాద్, బ్రాంచ్ చైర్మన్ మంద కృష్ణ పాల్గొని మాట్లాడారు. వైస్ చైర్మన్ మురళీకృష్ణప్రసాద్‌తో పాటు కార్తీక్‌రెడ్డి, తేజస్వి, సందీప్, మూర్తి, ప్రభాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రానైట్ వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి ఆర్ అండ్‌బీ రహదారి కోతకు గురికాగా ఎర్రగడ్డ–కొక్కిరేణి గ్రామాల మధ్య కొందరు వ్యక్తులు గ్రానైట్ వ్యర్థాలను పోయడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో గత నెల 30న వ్యర్థాలు.. అనర్థాలు అనే కథనంతో సాక్షిలో వార్తా ప్రచురితమవగా.. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మంగళవారం గ్రానైట్ వ్యర్థాలను తొలగించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణానికి టెండర్లు జరుగుతాయని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు.



ముందుకు సాగని ఆర్‌యూబీ నిర్మాణ పనులు

ఆర్‌యూబీ.. ఆగమాగం!

- ఆగిన రైల్వే అండ్ బ్రిడ్జి నిర్మాణ పనులు
- సగం పనులతో పొంచి ఉన్న ప్రమాదం
- తవ్వి వదిలేయడంతో భయపడుతున్న జనం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 16వ డివిజన్ ధంసలాపురం ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అగ్రహారం రైల్వే గేట్ వద్ద ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) పనులను 2022 మార్చిలో ప్రారంభించారు. అర కిలోమీటరు వరకు గుంతలా తవ్వి వదిలేయడంతో ఇది ప్రమాదకరంగా మారింది. సగం కూడా పూర్తి చేయకుండా మధ్యలోనే నిలిపివేశారు. దీని పరిసర ప్రాంతాల వారు వివిధ పనుల నిమిత్తం ఈ గేటు వద్ద ట్రాక్‌ను దాటాల్సి ఉండడంతో తవ్విన గుంత వద్ద భయాందోళన చెందుతున్నారు.

పొంచి ఉన్న ముప్పు..

ధంసలాపురం, అగ్రహారం ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం రూ.16.94 కోట్ల వ్యయంతో ఆర్‌యూబీ నిర్మాణానికి 2021లో శంకుస్థాపన చేసి పనులను 2022 మార్చిలో ప్రారంభించారు. కొద్ది మేర పూర్తయ్యాక వదిలిపెట్టడంతో తీసిన గుంతలో వర్షపునీరు చేరుతోంది. వర్షం పడినప్పుడల్లా చుట్టూ మట్టి పెల్లలు అందులో పడుతూ రోడ్డు కూడా కుచించుకుపోతోంది. దీంతో అటుగా వెళ్లే గేదెలు, మనుషులకు ప్రమాదం పొంచి ఉంది. 2023లో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గుంతలో పడగా.. స్థానికులు తాళ్ల సాయంతో బయటకు లాగాడు. దీన్ని ఇలాగే వదిలేస్తే మరిన్ని ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుంత పక్కన ఉన్న గోడలు కూలి పడిన దృశ్యం

మురుగు వాసన..

ఆర్‌యూబీ గుంత తవ్వి వదిలేయడంతో దానిలో వర్షపు నీటితో పాటు వ్యర్థాలు, ప్లాస్టిక్ కాగితాలు కలవడంతో దుర్వాసన వస్తోంది. దోమల కాలం కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పనులు మధ్యలోనే ఆగిపోయి సమస్యగా మారినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

భయంగా ఉంది..



అండర్ బ్రిడ్జి కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా ఉంది. పొలం పనులకు వెళ్లేవారు, స్కూళ్లకు వెళ్లే పిల్లలు ఈ గేటు దాటుతుంటారు. ఈక్రమంలో వారు అందులో ఎక్కడ జారి పడతారోనని భయంగా ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి కనీసం గుంత చుట్టూ అయినా రక్షణ చర్యలు చేపట్టాలి.

– కొదుమూరి నాగేశ్వరరావు, స్థానికుడు

దినదిన గండం..



నిత్యం మనుషులు, పశువులు ఈ గుంత పక్క నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గుంత దాటే వరకు పెద్ద గండమనే చెప్పాలి. గుంత దాటినప్పుడల్లా హమ్మయ్య ఈరోజు గండం తప్పిందిలే అని ఆనందిస్తున్నాం. ఏళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం లేదు.

– మామిడి శ్రీనివాసరావు, అగ్రహారం

డ్రైడేను విధిగా నిర్వహించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగర పరిశుభ్రతకు డ్రైడేను విధిగా నిర్వహించాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. మంగళవారం నగరంలోని 57వ డివిజన్‌లో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఖమ్మం క్లీన్ అండ్ గ్రీన్ నగరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, మెప్మా టీఎంసీ జి.సుజాత, సీఓలు తదితరులు పాల్గొన్నారు. కాగా, హైదరాబాద్‌లో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే అమృత్ ప్రత్యేక సమావేశంలో పాల్గొనేందుకు మేయర్, డిప్యూటీ మేయర్ బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు.



నిల్వ నీటిని పరిశీలిస్తున్న మేయర్

మేయర్ స్థానమే లక్ష్యం



ఐక్యత చాటుతున్న సంఘం నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: రానున్న ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ స్థానమే లక్ష్యంగా మున్నూరు కాపులు, బీసీలు ఐక్యంగా ముందుకు సాగాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు ఆర్జేసీ గుండాల కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని 33వ డివిజన్‌లో జరిగిన సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన మున్నూరు కాపులు సహా బీసీ కులాలకు ప్రాధాన్యమిచ్చేలా సీట్లను కేటాయించాలని కోరారు. అనంతరం డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా అధ్యక్షుడిగా మార్తా నరసింహారావు, కార్యదర్శిగా అల్లం వీరభద్రం నియమితులయ్యారు. నాయకులు గీత వెంకన్న, కొత్తా సీతారాములు, తాళ్లూరి హనుమంతరావు, తోట వీరభద్రం, కస్తూరి లక్ష్మీనారాయణ, రమణ పాల్గొన్నారు.

నోట్ బుక్స్, బ్యాగులు..



గొల్లగూడెం పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయుల బృందం, దాతలు

ఖమ్మంఅర్బన్/ రఘునాథపాలెం: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం పీఎస్ వెలుగుమట్ల స్కూల్, రఘునాథపాలెం మండలం గణేశ్వరం పాఠశాలల్లో ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. గణేశ్వరం పాఠశాలలో 76 మంది విద్యార్థులకు అందిచగా.. హెచ్‌ఎం కె.విజయశ్రీ, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే వెలుగుమట్ల స్కూల్ ప్రాంగణంలో నందకుమార్, వాసిరెడ్డి రామ్మోహన్‌రావు దాతల సహకారంతో రూ.30 వేల విలువైన నోట్‌బక్స్, బ్యాగులు అందించగా.. హెచ్‌ఎం ప్రమీలరాణి, మంగమ్మ, కార్పొరేటర్ వరరాజు, డివిజన్ అధ్యక్షుడు జానీమియా పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

తిరుమలాయపాలెం: నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని కూసుమంచి ఏడీఏ సరిత అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో విత్తన ఎరువులు, పురుగుమందుల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి ఏఈఓలు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పాశ మైలారం సిగాచి ఫార్మా కార్మికుల మరణాలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.హన్మేష్, జి.రామయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు సీ.వై.పుల్లయ్య తదితరులు మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నాయని మండిపడ్డారు. నాయకులు కె.శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాలాభిషేకం

కూసుమంచి: మండలంలోని తురకగూడెం నుంచి కిష్టాపురం వరకు రూ.1.8 కోట్లతో బీటీ రహదారిని మంజూరు చేయగా మంగళవారం తురకగూడెం గ్రామానికి చెందిన కొమ్ము ప్రసాద్ ఆధ్వర్యాన గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

గ్రామాల్లో అధికారుల సర్వే

తిరుమలాయపాలెం/కూసుమంచి: గిరిజనుల సంక్షేమం ఆచరణ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తి ఆబ్‌జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంపై మంగళవారం లక్ష్మీదేవిపల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఖలీల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రణీతలు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయా లేదా అని తదితర అంశాలపై సర్వే చేపట్టారు. అలాగే కూసుమంచి మండలం గోరీలపాడుతండాలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రత్యేక శిబిరం నిర్వహించి అవగాహన కల్పించారు.

సాయిరాం ఏజెన్సీకి ప్రశంసాపత్రం

ఖమ్మంగాంధీచౌక్: వస్తు సేవా పన్ను(జీఎస్టీ)ను సక్రమంగా నిర్వహిస్తున్న ఖమ్మంకు చెందిన శ్రీ సాయిరాం ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చైర్మన్ సంజయ్‌కుమార్ అగర్వాల్ నుంచి మంగళవార ప్రశంసా పత్రం అందింది. 2024–25 సంవత్సరానికి గాను అన్ని రకాల పన్నులు చెల్లించినందుకు సంస్థ అధినేత కాసిబోయిన అనంతరాములుకు ప్రశంసాపత్రం అందింది.

బీజేపీ నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ తెలంగాణ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఎన్.రామచంద్రరావు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన పొంగులేటి సుధాకర్‌రెడ్డిలను ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లా బీజేపీ నేతలు గెంటెల విద్యాసాగర్, మేకల నాగేందర్, నున్నారవి, విజయరాజు, అంజయ్య, కుమిలి శ్రీనివాస్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సొసైటీ బాధ్యులు

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెం గ్రామంలో రిహాబిలిటేషన్ ఆఫ్ గౌతమ్ బుద్ధ చక్రవర్తి సొసైటీ ఆధ్వర్యాన ప్లాస్టిక్ నియంత్రణపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు ప్లాస్టిక్ భూతం వలన జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. రియల్ ఎస్టేట్స్ మండల అధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి, సంస్థ వ్యవస్థాపకుడు కె.వెంకటేశ్వర్లు, మధు, దివ్యమూర్తి, నాగేశ్వరరావు, చిలకల వెంకయ్య, చంద్రయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల రెండో వారంలో నిర్వహించనున్న గ్రామ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కిసాన్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాయకులు కొంటిముక్కల నాగేశ్వరరావు, కోటేరు నర్సిరెడ్డి, గంగరాజు, నరసింహారావు పాల్గొన్నారు.

నూతన ఒరవడితో ప్రజా పోరాటాలు

ఖమ్మంరూరల్: సీపీఐ వందేళ్ల ప్రజాపోరాటాల ఒరవడితో పార్టీకి వన్నె తెచ్చేలా నూతన ఒరవడిని కొనసాగిస్తున్నట్లు పార్టీ మండల, ఏదులాపురం మున్సిపాలిటీ ఉమ్మడి కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం తీర్మానించిన నిర్ణయాలను వెల్లడించారు. మండల సహాయ కార్యదర్శి ఉన్నం రంగారావు, నాయకులు దండి రంగారావు,చెరుకుపల్లి భాస్కర్, కళింగి మోహన్‌రావు, బాణోత్ రామ్మూర్తి పాల్గొన్నారు.

హాస్టల్‌లో తహసీల్దార్ బస



విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న తహసీల్దార్

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో ఉన్న సుబ్లేడు బాలుర వసతిగృహంలో మంగళవారం రాత్రి తహసీల్దార్ లూథర్ విల్సన్ బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతిగృహంలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. మెనూ అమలుతీరు, పరిసరాల పరిశుభ్రత, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి నిద్రించారు.

కార్మికులకు పని భద్రత కల్పించాలి

ఖమ్మంమయూరిసెంటర్: భవన నిర్మాణ కార్మికులకు కార్మిక చట్టాలను వర్తింపజేసి, వారి పనికి భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హన్మేష్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ప్రభుత్వ ఆధీనంలో ఉంచి, కార్మికులకు ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్‌చేశారు. టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి గోస్ పుల్లయ్య, శీలం లెనిన్, గొడుగు విజయ్, నరసింహారావు, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు కొయ్యల శ్రీనివాస్, సీవై పుల్లయ్య, జిల్లా కోశాధికారి ఎ.శరత్, కె.పుల్లారావు, ఎస్.వెంకటనర్సయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

ఖమ్మంఅర్బన్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన ఖమ్మం–బోనకల్లు ప్రధాన రహదారిపై నగరంలోని శ్రీరాంనగర్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ధంసలాపురం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి మరో ద్విచక్రవాహనం ఢీకొనగా.. ముందు వెళ్తున్న శ్రీరాంహిల్స్ కాలనీకి చెందిన పోట్ల వెంకట్రామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే వెనుక బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులకు స్వల్పంగా గాయాలు కాగా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి..

నేలకొండపల్లి: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తొగరాయికి చెందిన బి.వేలాద్రి మంగళవారం సాయంత్రం బైక్‌పై ముదిగొండ మండలం కమలాపురం వెళ్తున్నాడు. ఈక్రమంలో మండలంలోని పాత కొత్తూరు మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం 108లో స్థానిక ఆస్పత్రికి, ఆపై ఖమ్మంకు తరలించారు.

రాకపోకలకు అంతరాయం

ఖమ్మంక్రైం: నగరంలోని నాయుడుపేట నుంచి మున్నేరు వరకు గల డ్రెయినేజీ కాల్వ పూడికతీత పనుల కారణంగా మున్నేరు వంతెన వద్ద మంగళవారం రాత్రి రెండు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనాలను ప్రకాష్‌నగర్‌బ్రిడ్జి, కరుణగిరి బైపాస్ బ్రిడ్జిపై నుంచి మళ్లించారు. కాగా, మున్నేరుకు వరద నీరు రావటం వల్లే రాకపోకలు నిలిచిపోయాయని సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ తెలిపారు.

పప్పుధాన్యాల విత్తనాలు అందజేత

రఘునాథపాలెం: రఘునాథపాలెం రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత పథకం కింద పప్పుధాన్యాల ఉత్పత్తి పథకంలో భాగంగా మంగళవారం వ్యవసాయశాఖ ఖమ్మం డివిజన్ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు కంది రకం ఎల్‌ఆర్‌జీ–52 విత్తనాల చిరు సంచులను రైతులకు అందజేశారు. మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్‌రెడ్డి, రైతు శిక్షణ అధికారులు ఇంటూరి భాస్కర్, శరత్, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే సమస్యల పరిష్కారం

ఖమ్మం మామిళ్లగూడెం/కామేపల్లి: రాజ్యాధికారంతోనే లంబాడీల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆ దిశగా లంబాడీలు సంఘటితంగా ముందుకు కదలాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు భద్రునాయక్, వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయిలు పిలుపునిచ్చారు. ఎల్ హెచ్‌పీఎస్ ఆవిర్భావం సందర్భంగా జరిగిన పూలే దంపతుల విగ్రహాలతో పాటు బీఆర్ అంబేడ్కర్, సేవాలాల్ మహారాజ్, టానునాయక్, మారోజు వీరన్న చిత్రపటాలకు నివాళులర్పించగా.. ఎల్‌హెచ్‌పీఎస్ గౌరవ సలహాదారుడు రాంబాబు నాయక్, వీరనారీమణుల ఆశయ సాధన సమితి అడ్వైజర్ బానోత్ తారాదేవిలు సంఘం జెండాను ఆవిష్కరించారు. నగరంలో మహిళలు బిందెలతో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కేశవ నాయక్, ఖమ్మం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మోహన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రవీందర్‌నాయక్‌లతో పాటు నాగయ్య, వీరన్న, నాగేశ్వరరావు, సంజీవరావు, జ్యోతిబాయి, త్రివేణి, సరోజిని, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు. అలాగే కామేపల్లి కొత్తలింగాల క్రాస్‌రోడ్డులో ఎల్‌హెచ్‌పీఎస్ నంగారాభేరి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బోడా మంగ్యాజీనాయక్ ఆధ్వర్యాన జెండాను ఆవిష్కరించారు. గింజల నరసింహారెడ్డి, జగన్నాథరెడ్డి, సరిరాం, బావ్‌సింగ్, శ్రీను, రాందాస్ పాల్గొన్నారు.

'వనజీవి' జయంతి

ఖమ్మంరూరల్: పద్మశ్రీ వనజీవి రామయ్య జయంతి వేడుకలను మంగళవారం మండలంలోని డేర్ ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ దరిపల్లి కిరణ్ మొక్కలు నాటి నివాళులర్పించాక రామయ్య ఆశయాలను కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు.

లీకేజీలతో నీరు వృథా..!



రెండు చోట్ల వృథాగా పోతున్న నీరు

పైపుల లీకేజీతో ఇళ్లకు సరఫరా అయ్యే నీటి కన్నా వృథాగా పోయే నీరే అధికంగా ఉంది. నగరంలోని రాపర్తినగర్ బీసీ కాలనీలో ఒకే ప్రాంతంలో రెండు చోట్ల పైపులు పగిలి నీరు వృథాగా పోతోంది. ఈ లీకేజీలకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నికార్సయిన పార్టీ కార్యకర్త అబ్బాస్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మధు, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్‌లో నికార్సయిన కార్యకర్తగా పనిచేసిన అబ్బాస్ ఎన్ని కష్టాలు వచ్చినా గులాబీ జెండాను వీడలేదని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ అన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ శ్రీవిద్య ఆధ్వర్యాన ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన అబ్బాస్ సంస్మరణ సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. పార్టీలు ఎంతమంది మారినా అబ్బాస్ మాత్రం నిబద్ధత కలిగిన కార్యకర్తగా పార్టీలోనే కొనసాగారని తెలిపారు. నగర అధ్యక్షుడు నాగరాజు మాట్లాడగా డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాఘభూషణం, గ్రంథాలయ సంస్థ మాజీ చెర్మన్ ఖమర్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మక్బూల్, కూరాకుల వలరాజు, జ్యోతిరెడ్డి, పల్లా రోజ్‌లీనా, నాయకులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బచ్చు విజయ్, బత్తుల మొరళి, మచ్చా నరేందర్, తాజుద్దీన్, శంషుద్దీన్, మెంతుల శ్రీశైలం, కొప్పెర నర్సింహారావు, వీరూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలోని 11మంది బాధితులకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం క్లెయిమ్‌లకు సంబంధించిన చెక్కులను మేనేజర్ వీరబాబు అందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం స్థానిక మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి సిఫారసుతో చెక్కులు మంజూరు కాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, నాగేశ్వరరావు, భద్రయ్య, బొందయ్య, వెంకన్న, నాగరాజు, సత్యనారాయణ, ఏడుకొండలు, నరేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు..

రఘునాథపాలెం : మండలంలోని రఘునాథపాలెం, వేపకుంట్ల పంచాయతీల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాతా రఘురాంలు మంగళవారం పంపిణీ చేశారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేయగా.. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనిల్, అనురాధ, ఆరివికట్ల ప్రేమ్‌కుమార్, బండినాగేశ్వరరావు, రెంటాల ధానయ్య, గుడిపుడి రామారావులతో పాటు శారద, ప్రసాద్, వెంకటనర్సయ్య, పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంసహకారనగర్/తిరుమలాయపాలెం: డాక్టర్స్ డే సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ముదుసు జాకోబ్ ప్రతాప్, జిల్లా అధ్యక్షుడు కొర్లపాటి చిరంజీవి ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలోని విజయ నర్సింగ్ హోమ్ వైద్యురాలు డాక్టర్ వెలిగేటి విజయలక్ష్మి గత 50ఏళ్లుగా వైద్య సేవలు అందించినందుకు గాను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పేరం మల్లయ్య, నగర కాంగ్రెస్ నాయకులు వడ్డేబోయిన శ్రీను, దాసరి పూర్ణ, వుల్లోజి రమేష్, జెట్టి నవీన్‌బాబు, తోగరు రమేష్,పాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని క్రియేటివ్ పాఠశాలలో ఉచిత డెంటల్ క్యాంపు నిర్వహించినట్లు కరస్పాండెంట్ బిజ్జాల కమలాకర్, డైరెక్టర్ బిజ్జాల కౌశిక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా డెంటల్ డాక్టర్ నిహారిక పిల్లలకు పరీక్షలు చేశారు. అదేవిధంగా తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృపాఉషశ్రీ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆర్‌ఎంఓ వైదేహి, డాక్టర్లు బొల్లికొండ శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు, ప్రతాపరెడ్డి, సురేష్, సూరజ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

కూసుమంచి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఎన్నారై ఫౌండేషన్‌కు చెందిన బాధ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, అవసరాలను హెచ్‌ఎంల ద్వారా అడిగి తెలుసుకున్నారు. తమ కసంస్థ ఆధ్వర్యాన విద్యాభివృద్ధికి చేయూత ఇస్తున్నట్లు బాధ్యులు తెలిపారు.

పంట మార్పిడి.. అధిక దిగుబడి

- తగ్గనున్న చీడపీడల బెడద
- నేల పోషకాల సమతుల్యతకు దోహదం
- పర్యావరణ రక్షణకు అనుకూలం
- భూసారం పెంపునకు వ్యవసాయ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

కామేపల్లి: రైతులు తమ పొలాల్లో ఎప్పుడు ఒకే రకమైన పంటలను సాగు చేయకుండా పంట మార్పిడితో అధిక లాభాలు గడించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఏటా ఒకే రకమైన పంటలను సాగుచేయడం వల్ల పురుగు పట్టడం, ఇతర కీటకాలు సోకి దిగుబడి తగ్గిపోయి రైతులను తీవ్ర నష్టాలోకి ముంచుతోంది. అలాగే పంట మొక్కలు భూమిలోని ఒకే లోతు పొరల నుంచి పోషకాలను స్వీకరించడంతో పోషకాలు కూడా తగ్గి పంటల దిగుబడి ప్రభావం చూపిస్తుంది. ఈనేపథ్యాన పంట మార్పిడికి ఉన్న ప్రాధాన్యత, దానివల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు వివరిస్తున్నారు.

ప్రయోజనాలు..

- ఒక పంటను ఒకే పొలంలో వరుసగా సాగు చేయడం వల్ల చీడపీడల ఉధృతి అధికమయ్యే అవకాశం ఉంది.
- పురుగు జీవిత చక్రం నిరాటకంగా ముగించుకుని ఎక్కువగా హాని కలిగిస్తాయి.
- వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను నివారించవచ్చు.
- వాణిజ్య పంటలను మార్పిడి చేయకపోతే నేల సారవంతం కోల్పోతుంది.
- వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న వంటి పంటలు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి.
- నేల భౌతిక స్వభావం దెబ్బతినకుండా, చీడపీడల అభివృద్ధి నిరోధించడానికి వీలుటుంది.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

మార్పిడి విధానం..

- వరి తర్వాత మినుము, పెసర, శనగ వేయడం వల్ల సుడిదోమ, ఇతర వైరస్‌లను నివారించవచ్చు.
- పత్తి వేసిన పొలంలో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, మినుము వేస్తే లద్దె పురుగు, పచ్చ పురుగులను నివారించవచ్చు.
- వరిని సాగు చేసే పొలాల్లో ముందుగా పప్పు ధాన్యాలను సాగు చేయడం వల్ల నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకుముడతను నివారించేందుకు పప్పు జాతికి చెందిన పైర్లతో మార్పిడి చేయాలి.
- కంది, మిరప పంటల్లో ఎండు తెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి.
- ఆహార పంటలైనా వరి, జొన్న, మొక్కజొన్న పంటలను పెసర, మినుము, వేరుశనగ పంటలతో మార్పిడి చేయాలి.
- ఆహార వాణిజ్య పంటలను పశ్రుగాస పైర్లతో ఒకసారి పప్పు జాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం లాభదాయకం.

మార్పు అవసరం..



రైతులు అధిక దిగుబడి సాధించాలంటే పంట మార్పిడి చాలా కీలకం. అందుకు రైతులకు పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో వివరిస్తున్నాం. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక లాభాలు గడించాలి.

– భూక్యా తారాదేవి, ఏఓ కామేపల్లి

ఏటా అవలంబిస్తాం..




ప్రతి ఏటా సాగు చేసేటప్పుడు పంట మార్పిడి విధానం అవలంబిస్తా. దీంతో పంట ఎదుగుదల, దిగుబడితో పాటు మొక్క ఎంతో ఆరోగ్యంగా ఉంటుంది. ఆశించిన స్థాయి కంటే దిగుబడి ఎక్కువగా సాధిస్తున్నా.

– జర్పుల రామారావు, రైతు, రామకృష్ణాపురం

భాస్వరాన్ని కరిగించే ఎరువులపై అవగాహన

కూసుమంచి: రైతులు నారు కట్టలను పీఎస్‌బీ ద్రావణంలో ముంచి నాటు వేయడం ద్వారా భాస్వరం ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని ఏఓ వాణి సూచించారు. మంగళవారం మండలంలోని గురువాయిగూడెంలో నిర్వహించిన క్షేత్రప్రదర్శనలో రైతులకు నారు శుద్ధి పద్ధతులను వివరించారు. భాస్వరాన్ని కరిగించేందుకు పీఎస్‌బీ ద్రావణాన్ని పశువుల ఎరువులో కలిపి వినియోగించవచ్చని వివరించారు. అనంతరం నానో యూరియా వలన కలిగే ప్రయోజనాలను తెలిపారు. ఏఈఓలు రవిందర్, ప్రియాంక, సౌమ్యపాల్గొన్నారు.



పీఎస్‌బీ ద్రావణం వినియోగాన్ని వివరిస్తున్న ఏఓ

ప్రకృతి వ్యవసాయంపై..

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెం రైతు వేదికలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.సరిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ రైతు తమ విస్తీర్ణంలో కొంత మేర ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంభించాలని ప్రకృతి ఆవశ్యకతను వివరించారు. మండల వ్యవసాయాధికారి ఉమానగేష్, ఏఈఓ వంశీ, ఆదర్శ్, నజ్మా కౌసర్, అభ్యుదయ రైతు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.